ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 24 సెప్టెంబరు 2025



ఆదికర్మయోగి కార్యక్రమంపై జేసీ సమీక్ష

పార్వతీపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆది కర్మయోగి కార్యక్రమంపై సిద్ధం చేసిన విజన్ ప్లాన్‌ను ఎంపీడీవోలు పునఃపరిశీలించి ఐటీడీఏకు అందజేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. 12 మండలాల్లోని 165 గ్రామాల్లో ఆదికర్మయోగి కార్యక్రమం అమలు కానుందన్నారు. 949 హేబిటేషన్లను కవర్ చేస్తూ గ్రామ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో మురళీధర్, జిల్లా, బ్లాక్ మాస్టర్ ట్రైనీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా కోటదుర్గమ్మ



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

పాలకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రెండో రోజు మంగళవారం పాలకొండ కోటదుర్గమ్మ గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన ప్రజలు క్యూలైన్లలో బారులు దీరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పులకించిపోయారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు చేశారు. ఎవరికీ ఎటువంటి కలగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. జిల్లా దేవదాయశాఖాధికారి రాజారావు, ఈవో వీవీ సూర్యనారాయణ ఉత్సవాలను పర్యవేక్షించారు.



కోట దుర్గమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

పుర పాలన.. గాడిన పడేనా?

- ఎఫ్ఏసీ కమిషనర్లతోనే నెట్టుకొస్తున్న వైనం
- అధ్వానంగా తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ

- అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయ లోపం
- చోద్యం చూస్తున్న పాలకవర్గ సభ్యులు
- ఎవరికీ పట్టని ప్రజా సమస్యలు
- ఇదీ పార్వతీపురం మునిసిపాలిటీ పరిస్థితి

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పార్వతీపురం మునిసిపాలిటీలో పాలన పూర్తిగా గాడి తప్పింది. ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు జరగడం లేదు. తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. వార్డుల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. మరోవైపు ఇన్‌చార్జి అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. గ్రేడ్-1 మునిసిపాలిటీకి గ్రూప్-2 స్థాయి అధికారులను కమిషనర్లుగా నియమించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు పాలకవర్గం పూర్తిగా రాజకీయ కుర్చీలాటకే పరిమితమైందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్వతీపురం పురపాలక సంఘంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- పార్వతీపురం మునిసిపాలిటీ గత కొన్ని నెలలుగా ఓన్‌పే, ఎఫ్ఏసీ కమిషనర్ల పాలనలోనే సాగుతోంది. రెండేళ్ల కిందట కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కోన శ్రీనివాసరావు రాజకీయ కారణాల వల్ల గత ఏడాది అక్టోబరులో ఆయన బదిలీపై వెళ్లిపోయారు. మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం డీఈ శ్రీనివాసరావును మూడు నెలల పాటు ఎఫ్ఏసీ కమిషనర్‌గా నియమించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న గ్రేడ్-2 మేనేజర్ స్థాయిలో ఉన్న సీహెచ్ వెంకటేశ్వర్లు ఓన్‌పే కమిషనర్‌గా నియమించారు. గతనెల 5న సీడీఎంఏ కార్యాలయానికి సరెండర్ కావాలని ఆదేశాలు రావడంతో ఆయన కూడా వెళ్లిపోయారు. ఆగస్టు 9న మళ్లీ డీఈ శ్రీనివాసరాజును ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. అయితే జీతాలు, ఇతర బిల్లులు పాస్ చేసేందుకు అధికారాలు లేకపోడంతో అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. దీంతో గత నెల 28న శ్రీనివాసరాజుకు ఎఫ్ఏసీగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పాలనా వ్యవహారాలను చక్కబెట్టడంలో అంతగా అనుభవం లేని ఆయన ఏదోలా నెట్టుకొస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.
- గత ఆరు నెలలుగా ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయం కొరవడింది. తాగునీటి సరఫరాకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో పనిచేయించుకోలేక చేతులెత్తేశారు. పనిఒత్తిడి తట్టుకోలేక ఓ ఇంజనీర్ వారం

(మిగతా 8వ పేజీలో...)



పార్వతీపురం మునిసిపల్ కార్యాలయం

వాహనమిత్ర @ 5,157

- ఇదీ జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య
- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం

పార్వతీపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం వర్తింపజేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దసరా కానుకగా రూ.15 వేల చొప్పున వారి ఖాతాకు జమ చేయనున్నట్లు ఇటీవల సీఎం చంద్రబాబు వెల్లడించారు. అయితే జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. ఈ పథకానికి సంబంధించి ఇప్పటివరకు 5,356 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయి. అం దులో 5,157 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు. మరో 161 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. తుది జాబితాను ఈ నెల 25న ప్రకటించే అవకాశం ఉంది. కాగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తుది జాబితా ప్రకటిస్తామని జిల్లా రవాణా శాఖాధికారి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో 4,614 మందిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. అనేక మంది అర్హులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ నిబంధనల పేరిట తిరస్కరించింది.



అమ్మవారిపై భక్తితో..

8లో

టీడీపీలో గురుగుబిల్లి
ఎంపీపీ చేరిక
- ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు కూడా..

భక్తులకు ఎలాంటి
అసౌకర్యం కలగరాదు
6లో
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి
- కోట దుర్గమ్మకు పూజలు

చెట్టు తరలింపూ
ఓ సంబరమే
- ఇక్కడి నుంచే పైడితల్లి ఉత్సవ ప్రక్రియ వేగవంతం



6లో

పర్యాటక అభివృద్ధికి చర్యలు

- వెదురుతో కాటేజీలు నిర్మించండి
- గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలకు నెలవైన సీతంపేట మన్యంలో పర్యాటక ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తొలిసారిగా సీతంపేట ఏజెన్సీకి వచ్చిన ఆయన మంగళవారం ఆడలి వ్యూపాయింట్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడకు వచ్చే పర్యాటకుల కోసం వెదురుతో కాటేజీలు నిర్మించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్, జిల్లా టూరిజం అధికారి నారాయణరావుకు సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో గిరిజన యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామని తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో శిక్షణలు ఇప్పిస్తామన్నారు. అక్కడి నుంచి ఐటీడీఏ కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్ వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు.

పర్యాటకుల కోసం హోమ్ స్టేలు

సీతంపేట ఏజెన్సీలోని వ్యూపాయింట్స్, జలపాతాలు చూసేందుకు వచ్చే పర్యాటకుల కోసం ఈ ఏడాది ఐటీడీఏ ద్వారా 50 పీవీటీజీ హోమ్ స్టేలు సిద్ధం చేయాలని కలెక్టర్

(మిగతా 8వ పేజీలో...)



ఆడలి వ్యూపాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

గంజాయిని అరికట్టేందుకు
ఉమ్మడి వ్యూహం

- డీఐజీ గోపీనాథ్ జట్టి

బెలగాం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా అరికట్టేందుకు ఇకపై ఆంధ్రా-ఒడిశా పోలీసులు ఉమ్మడి వ్యూహంతో పనిచేస్తారని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తెలిపారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంతర్రాష్ట్రాల పోలీసుల మధ్య కీలక సమావేశం జరిగింది. ఈ సం దర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. 'అల్లూరి జిల్లాలో 2021-22లో 7,515 ఎకరాల్లో ఉన్న గంజాయి సాగును ధ్వంసం చేశాం. ప్రస్తుతం 93 ఎకరాలకు తగ్గింది. 10,308 గ్రామాల్లో రైతులకు 28 రకాల మొక్కలు పంపిణీ చేశాం. 2023లో 553 కేసులు నమోదు చేశాం. 1764 మందిని అరెస్ట్ చేశాం. 393 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. 2024లో 652 కేసులు నమోదు చేసి 35,062 కేజీల గంజాయిని పట్టుకున్నాం. 2025లో 377 కేసులు నమోదు చేసి 22,207 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. 1038 మందిని అరెస్ట్ చేశాం. 51 మందిపై పీడీ యాక్టు, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టాన్ని ప్రయోగించాం. నిందితులకు చెందిన రూ.10.04 కోట్ల విలువైన ఆస్తులపై ఆర్థిక విచారణ నిర్వహించాం. సంకల్పం పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవాలి. చెక్‌పోస్టులను పునర్ వ్యవస్థీకరించాలి. కొఠియా గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి.' అని తెలిపారు. ఈ సమావేశంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు అమిత్ బర్దార్, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏజెన్సీలో రహదారులు
మెరుగుపరచండి
- అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

6లో

ఆకట్టుకుంటున్న
జలపాతాలు

పోలమాంబకు ప్రత్యేక పూజలు
6లో

జరడ ప్రాంతాన్ని
వీడని ఏనుగులు



6లో

మా పరిస్థితేంటి?

- ఆవేదనలో గిరిజన గర్భిణుల వసతిగృహ వైద్య సిబ్బంది
- వారిని తాత్కాలికంగా నిలుపుదల చేయాలని మౌఖిక ఆదేశాలు
- ఆ స్థానంలో ఆసుపత్రి సిబ్బంది నియామకం
- కొన్నేళ్లుగా సేవలందిస్తున్న వారిని ఆదుకోవాలని విన్నపం



సాలూరు వసతిగృహంలో గర్భిణులకు సేవలందిస్తున్న దృశ్యం

సాలూరు, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): గిరిజన గర్భిణుల వసతి గృహాల్లో పనిచేస్తున్న వైద్యసిబ్బందిని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈ మేరకు సంబంధిత ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. వారి స్థానంలో ఏరియా ఆసుపత్రి సిబ్బందిని నియమిం చాలని సూచించారు. దీంతో కొన్నాళ్లుగా పనిచేస్తున్న వసతిగృహ సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- గిరిశిఖర గ్రామాలకు చెందిన గర్భిణులను మెరుగైన వైద్యసేవలు అందించేందుకు గతంలో సాలూరు, భద్రగిరి, సీతంపేటలో వసతి గృహాలు ఏర్పాటు చేశారు. వాటిల్లో స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంలు, డ్రైవర్‌ను 2019లో నియమించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక వారి పరిస్థితి మారింది. 2021 వరకు ఆరు నెలలకొకసారి జీతాలు చెల్లించేవారు. బడ్జెట్ రాలేదని ఆ తర్వాత 21 నెలల పాటు సగం జీతమే చెల్లించారు. 2023లో ఏడాది పాటు ఎలాంటి జీతాలు చెల్లించలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వైద్య సిబ్బందికి పూర్తిగా జీతాలు చెల్లించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు వరకు వారు విధులు నిర్వహించగా.. రెండు నెలల వేతనాలు మాత్రమే చెల్లించారు. ఇంకా ఏడు నెలల జీతం బకాయి ఉందని సాలూరు సిబ్బంది త్రివేణి, రాములమ్మ, మంగమ్మ, దేవి, నాగమణి, స్వప్న, బంగారు లక్ష్మి, నందిని తెలిపారు. కాగా మంగళవారం వారు విధుల్లోకి వెళ్లగా.. ఏరియా ఆసుపత్రి నుంచి నలుగురు సిబ్బంది (గౌరీశ్వరి, శ్వేత, నీలావతి, లక్ష్మి)లు ఇక్కడ ఉండడంతో వారు షాక్‌కు గురయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇక్కడకు వచ్చామని వారు చెప్పారు. 'మీరు ఇక్కడకు వచ్చి మా పొట్టలు కొట్టొద్దు..' అని సాలూరు వైటీసీ సిబ్బంది వారిని అక్కడి నుంచి బయటకు పంపించారు.
- సాలూరు పట్టణంలోని గుమడాంకు వెళ్లే దారిలో ఉన్న వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్)లో నిర్వహిస్తున్న గిరిజన గర్భిణుల వసతి గృహంలో ఒక స్టాఫ్ నర్సు

(మిగతా 8వ పేజీలో...)



వైటీసీ నుంచి బయటకు వచ్చిన ఏరియా ఆసుపత్రి సిబ్బంది

పైడిమాంబకు
ఘట నీరాజనం


విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవ సంబరానికి ముందే నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. మంగళవారం నగరంలోని పలు వీధుల నుంచి భక్తులు పైడిమాంబ ఘటాలను రాత్రి ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయం వద్ద సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోట నుంచి మూడులాంతర్లు, అంబటి సత్తర్వు నుంచి మూడులాంతర్లు, కన్యకా పరమేశ్వరీ ఆలయ రోడ్డు నుంచి మూడులాంతర్లు ఇలా ఏ రోడ్డు చూసినా భక్తులతో కిటకిటలాడుతూ కనిపించాయి. వారంతా పైడిమాంబకు ఘట నీరాజనం సమర్పించారు. ఈ నెల 30న మరో మంగళవారం రానుంది. ఆ రోజు కూడా భారీ ఎత్తున భక్తులు ముర్రాటలు సమర్పించనున్నారు.



కొత్త గురువులకు పిలుపు

- నేడు విజయవాడకు పయనం
- రేపు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత
- ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 578 టీచర్ పోస్టులు

సాలూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో కొలువు సాధించిన కొత్త గురువులకు విద్యాశాఖ పిలుపునందించింది. దీంతో వారు బుధవారం విజయవాడకు చేరుకోనున్నారు. 25న ఉద్యోగ నియామక పత్రాలు అందుకోనున్నారు. వాస్తవంగా ఈనెల 19న ఈ కార్యక్రమం జరగాల్సి ఉంది. అయితే విజయవాడలో భారీ వర్షాల కారణంగా చివరి క్షణంలో వాయిదా వేశారు. కొలువు సాధించిన ఉపాధ్యాయుడుతో పాటు మరొకరు సహాయకులను తీసుకొని డెంకాడ మండలం మోదవలస ఓయోస్టార్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చేరుకోవాలి. అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్‌లో బుధవారం ఉదయం ఆరు గంటలకు రిపోర్ట్ చేయాలి. మోదవలస నుంచి విజయవాడ వెళ్లి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందుకోనున్నారు. కొత్త గురువులు, వారితో వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా విజయవాడలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సమావేశ ప్రాంగణంలోకి ఏయే జిల్లాలు ఏ గేట్ నుంచి రావాలో మార్గదర్శకాలు జారీ చేశారు.



40 బస్సులు సిద్ధం

కొత్త గురువులు, వారి సహాయకులను మోదవలస నుంచి విజయవాడకు తీసుకెళ్లడానికి ఉమ్మడి జిల్లా నుంచి 40 బస్సులు ఏర్పాటు చేసినట్టు మన్యం జిల్లా ఆర్టీసీ డీటీపీవో వెంకటేశ్వర రావు మంగళ వారం తెలిపారు. సాలూరు డిపో నుంచి 6, పార్వతీపురం 5, పాలకొండ 6, విజయనగరం

(మిగతా 8వ పేజీలో...)

చెట్టు తరలింపూ ఓ సంబరమే

● ఇక్కడి నుంచే ఉత్సవ ప్రక్రియ వేగవంతం


సిరిమాను చెట్టును తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరులతల్లి పైడిమాంబ సిరిమానోత్సవానికి సమయం ఆసన్నమైంది. గంట్యాడ మండలం కొండతామరపల్లిలో సిరిమాను, ఇరుసుమాను చెట్లకు గత కొన్ని రోజుల నుంచి భక్తులు పూజలు చేస్తున్నారు. ఈ చెట్లను ముహూర్త సమయానికి కొట్టి.. అక్కడి నుంచి భారీ ఊరేగింపు మధ్య విజయనగరంలోని ఆలయ పూజారి ఇంటికి తరలించడానికి దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ, అటవీ, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సిరిమానుగా మలిచే కార్యక్రమం పూజారి ఇంటి వద్ద ప్రత్యేక నిపుణులతో చేపట్టనున్నారు. బుధవారం ప్రత్యేక పూజలు, భారీ అన్నదానం అనంతరం ఈ చెట్లను మానులుగా మలిచి ఊరేగింపుగా తరలించడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై, సంప్రదాయబద్ధంగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ చెట్లను కొట్టిస్తారు.

బొట్టు పెట్టి..

పైడిమాంబ ఉత్సవాల్లో సిరిమానోత్సవమే ప్రధాన ఘట్టం. దీనికి సంబంధించి చింతచెట్లను సిరిమాను, ఇరుసుకు ఉపయోగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ చెట్లు పూజారికి కలలో కనిపించిన తరువాత ఆ ప్రాంతాలకు వెళ్లి... ఆ చెట్ల యాజమానులతో మాట్లాడి అనంతరం బొట్టు పెడతారు. ఒకప్పుడు సిరిమాను చెట్లను తరలించడానికి హుకుంపేట వాసులు వాహనాల్లో వెళ్లేవారు. ప్రస్తుతం సిరిమాను చెట్టుకు బొట్టు పెట్టడానికి... పూజలకు వేలాదిగా భక్తులు వస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అనేక మార్పులు చోటు చేసుకున్నప్పటికీ, అమ్మవారి ఉత్సవంలో మాత్రం పాత సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ నాటు బండ్ల పైనే ఎంత దూరమైనా సిరిమాను చెట్టును ఊరేగింపుగా తీసుకువస్తున్నారు. చెట్టు కొట్టే ప్రాంతం నుంచి ఆ మాను ఆలయ పూజారి ఇంటికి చేరుకునే వరకూ దారి పొడవునా భక్తులు నీరజనాలు పలుకుతారు. పసుపునీళ్లతో దారి పొడవునా సిరిమానుకు చల్లదనం చేస్తుంటారు.

పెరిగిన భక్తులు..


సిరిమాను, ఇరుసుమాను చెట్లను 1958కి ముందు హుకుంపేట వాసులు మాత్రమే తెచ్చేవారు. 1958 తరువాత దేవదాయ శాఖ ఆధీనంలో ఈ ప్రక్రియ సాగుతోంది. ముఖ్యంగా భక్తుల సంఖ్య విశేషంగా పెరగడంతో పోలీసు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయం అవసరమవుతోంది. సిరిమాను, ఇరుసుమాను చెట్ల తరలింపు ప్రక్రియలో వేలాది మంది భాగస్వాములు అవుతున్నారు. చాలా మంది భక్తులు విజయనగరం రాలేని వారు... సిరిమానును గుర్తించే ప్రాంతాలకు అతి దగ్గరలోని గ్రామాల వరకూ వచ్చి పూజలు చేస్తున్నారు.

నేడు తరలింపునకు సన్నాహాలు

● వివిధ రహదారుల నుంచి వాహనాల మళ్లింపు


సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

గంట్యాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండతామారాపల్లి గ్రామంలో గుర్తించిన సిరిమాను చెట్టును బుధవారం విజయనగరంలోని హుకుంపేటకు తరలించనున్నారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం సిరిమాను చెట్టుకు పూజలు చేసి.. అక్కడి నుంచి నాటుబండ్లపై హుకుంపేటకు తరలిస్తారు. అక్కడికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది ఇలా ఉండగా... సిరిమాను చెట్టు తరలింపు ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో వివిధ గ్రామాల నుంచి వచ్చే వాహనాలను మళ్లిస్తున్నట్టు ఎస్‌ఐ సాయికృష్ణ తెలిపారు. దేవుపల్లి నుంచి మరువాడ, కొత్తవలస, పెద్దమజ్జిపాలెం గ్రామాల నుంచి వాహనాలను పెదమజ్జిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్క నుంచి గింజేరు జంక్షన్ వద్ద జాతీయ రహదారి 516కి మళ్లిస్తామని తెలిపారు. విజయనగరం నుంచి పెదమజ్జిపాలెం, మరువాడ, కొత్తవలస వెళ్లే వాహనాలను గింజేరు గ్రామం మీదుగా మళ్లిస్తామని ఎస్‌ఐ వివరించారు.


పైడిమాంబకు అరటి పండ్లు సమర్పించిన దృశ్యం

అన్ని శాఖల సమన్వయం అవసరం

● కలెక్టర్ రామసుందర్‌రెడ్డి


సిరిమాను తిరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల కొంగు బంగారం పైడిమాంబ సిరిమాను సంబరాన్ని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్, దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆర్‌డీఓ కీర్తి, నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, పూజారి బంటుపల్లి వెంకటరావు, ఇతర శాఖల అధికారులతో కలిసి సిరిమాను సంబరానికి సంబంధించిన వివిధ ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. బుధవారం కొండతామరాపల్లి నుంచి సిరిమాను, ఇరుసుమాను చెట్లను తీసుకువచ్చే విషయమై ఆరా తీశారు. అధికార యంత్రాంగం అంతా అమ్మవారి ఆలయం, మూడులాంతర్లు, కోట ప్రాంతాల వరకూ కాలి నడకన వెళ్లి పరిశీలించారు. ఆలయం వద్ద క్యూలైన్ల ఏర్పాటు, ప్రసాదాల పంపిణీ, మీడియా పాయింట్ తదితర వాటిని పరిశీలించారు. అమ్మవారి జాతర సమయంలో చేపట్టే చర్యలపై కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. ఎస్పీ ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ జాతరలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఇన్‌ఛార్జి డీఎస్పీ ఆర్.గోవిందరావు, తహసీల్దారు ఎస్.కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబకు అరటిపండ్లు సమర్పణ

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ జాతర నేపథ్యంలో అమ్మవారిని విభిన్న రూపాల్లో అలంకరిస్తున్నారు. మంగళవారం భారీగా అరటిపండ్లను నివేదించారు. సిరిమాను సంబరం సమీపిస్తున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయానికి భక్తుల సంఖ్య పెరిగింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి పైడి మాంబకు విశేష పూజలు చేశా రు. వివిధ ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా చండీ హోమం

సాలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి అమ్మవారి ఆలయంలో దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు మంగళవారం చండీహోమాన్ని ఘనంగా నిర్వ హించారు. సాలూరుతోపాటు పరిసర గ్రామాలకు చెందిన మహిళలు, భక్తులు హోమానికి హాజరయ్యారు. కామాక్షి అమ్మ వారిని జామ కాయలతో అలంకరించారు.



జామకాయలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగరాదు

● మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి
● కోటదుర్గమ్మకు పూజలు

పాలకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు చూడాలని మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్‌తో కలసి కోటదుర్గమ్మను దర్శించుకున్నారు. అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ, ఈవో వి.వి.సూర్యనారాయణ ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో ప్రధాన అర్చకులు ఆశీర్వదించారు. దేవదాయ శాఖాధికారి రాజారావు కలెక్టర్‌కు దుశ్శాలువ కప్పి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్‌ను ఈవో వి.వి.సూర్యనారాయణ దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం సమీపంలోని అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. అర్చకులు మణీలశర్మ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సీఐ ఎ.ప్రసాదరావు, డివిజన్ ఆలయాల తనిఖీదారు ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.


కోటదుర్గమ్మను దర్శించుకుంటున్న కలెక్టర్, సబ్ కలెక్టర్

జరడ ప్రాంతాన్ని వీడని ఏనుగులు


తులసి గ్రామం వద్దనున్న ఏనుగులు

కురుపాం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కురుపాం మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో నాలుగు ఏనుగుల గుంపు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏడాది పొడవునా జరడ, తిత్తిరి పంచాయతీ గ్రామాల్లో సంచరిస్తూ గిరిజనుల ఫలసాయాలను నాశనం చేస్తున్నాయి. సీతంపేట, భామిని మండలాల పరిధిలో కూడా సంచరిస్తూ ఫలసాయాలు పాడుచేస్తున్నాయి. జరడ, జంపరకోట, గుండాం, ఎగువ గుండాం, గుమ్మిడిగూడ, తులసి గ్రామాల్లో కొండపోడుల మీద వేసిన ఫలసాయాలను పాడుచేస్తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం తులసి, టొంపలపాడు గ్రామాల్లో ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి.

ఏనుగులను తరలించాలి..

గత నెలలో అటవీ శాఖ అధికారులు జరడ ప్రాంతంలో పర్యటించి ఏనుగుల సమస్యకు పరిష్కారం చూపుతారని సమాచారం వచ్చింది. అధికారుల కోసం గిరిజనులందరం ఎదురు చూశాం. అధికారులు రాలేదు. అటవీశాఖ తరఫున బాధితులకు పరిహారం అందడం లేదు. ఏనుగుల సమస్యకు ప్రభుత్వం పూర్తి స్థాయి పరిష్కారం చూపాలి.

-ఊయక జ్యోతి, జరడ సర్పంచ్

పోలమాంబకు పూజలు

మక్కువ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ దేవాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను రెండోరోజు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. ఈవో బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు కె.శ్రీనివాసశర్మ పూజలు చేశారు.


గాయత్రీదేవిగా పూజలందుకున్న పోలమాంబ

అసెంబ్లీలో మన వాణి

ఏసీడీపీని పునరుద్ధరించండి

● ఎమ్మెల్యే బేబీనాయన



బొబ్బిలి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి పథకాన్ని (ఏసీడీపీ) పునరుద్ధరించాలని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. దీనికి శాసన సభ్యులతో పాటు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సైతం మద్దతు పలికారు. బేబీనాయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఏసీడీపీ నిధులను మంజూరు చేసేవారని, దీనితో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలో ప్రజలు కోరిన ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి వాటిని ఖర్చు చేసేవారని తెలిపారు. ప్రభుత్వం పెద్దమనసు చేసుకొని ఏసీడీపీ నిధుల మంజూరును పునరుద్ధరించాలని కోరారు. దీనికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు హర్షం వ్యక్తం చేస్తూ మంచి ప్రతిపాదన చేశారని బేబీనాయనను అభినందించారు. అలాగే బాడంగి మండలం డొంకినవలస ఫిర్కాలో సుమారు 12 గ్రామాల రైతుల కోసం పెద్దగెడ్డ జలాలను రప్పించాలని కోరారు. రామభద్రపురం మండలం కోటశిర్లాం దగ్గర ఏడొంపుల గెడ్డ నుంచి ఆరికతోట మీదుగా పెద్దపల్లి గోపినాథుని పట్నాయక్ చెరువుకు నీటిని మళ్లిస్తే ఆ గ్రామల సాగునీటి అవసరాలు తీరుతాయని తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా గోదావరి జలాలను దత్తిరాజేరు మండలం మీదుగా రామభద్రపురం మండలంలోని వందలాది ఎకరాలకు పుష్కలంగా సాగునీరందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. తెర్లాం మండలం లోచర్ల, రాముడువలస గ్రామాలలో ఎత్తిపోతల పథకాలను గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంజూరు చేశారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంతో ఆ పనులను చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. వీటి పనులు చేపట్టాలని బేబీనాయన కోరారు.

జిందాల్ విషయం తేల్చండి

● ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



శృంగవరపుకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'పరిశ్రమల కోసం పేదల వద్దనున్న అసైన్డ్ భూములను తీసుకుంటున్నారు. నష్టపరిహారం పూర్తిగా ఇవ్వడం లేదు. సకాలంలో పరిశ్రమలను నిర్మించడం లేదు. పరిశ్రమల పేరు చెప్పి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారు. శృంగవరపుకోట మండల పరిధిలో 2005-2006లో జిందాల్ పరిశ్రమకు భూసేకరణ ఇలాగే జరిగింద'ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం శాసన మండలిలో ప్రస్తావించారు. 'పరిశ్రమ ను నిర్మించకపోవడంతో 2009 నుంచి రైతులు ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు. 2025 జూన్‌లో పోలీసుల సహకారంతో జిందాల్ యాజమాన్యం రైతులను భయభ్రాంతులను చేసి భూములను లాక్కునేందుకు ప్రయత్నించింది. ప్రభుత్వం న్యాయం చేస్తుందని రైతులు అనుకున్నారు. ప్రభుత్వం బాక్సైట్ ఇవ్వనందున పరిశ్రమ నిర్మించలేదని యాజమాన్యం చెబుతోంది. ఈ పరిశ్రమకు 90మెగావాట్ల విద్యుత్ ప్లాంటు మంజూరైంది. దీన్ని కూడా నిర్మించలేదు. మాకవానిపాలెం వద్ద ఇలాంటి పరిశ్రమకు భూములు ఇచ్చారు. అక్కడ విద్యుత్ ప్లాంటును నిర్మించారు. పంచాయతీ తీర్మానాలకు అనుగుణంగా హామీలు, ఆర్‌ఆర్ ప్యాకేజీలు సక్రమంగా అమలు కాలేదు. ఉద్యోగాలు ఇస్తామని ఒడిశా తీసుకెళ్లి... పిల్లలకు శిక్షణ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు రిటైర్‌మెంట్ ఇస్తున్నారు. షేర్లు ఇస్తామని మోసం చేశారు. ఎంఎస్‌ఎంఈ పార్కులను జిందాల్ పెడుతోంది. కలెక్టర్ ద్వారా షేర్లు ఇప్పించాలి. కంపెనీ వారితో మాట్లాడిరైతులతో చర్చించాలి. 94 రోజులుగా రైతులు నిరసనలు తెలియజేస్తున్నారు. వారికి న్యాయం చేయాల'ని ఎమ్మెల్సీ కోరారు.

ఏజెన్సీలో రహదారులు మెరుగుపరచండి

● ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



పాలకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నియోజకవర్గ పరిధిలో ఏజెన్సీలోని రహదారుల మెరుగుకు చర్యలు చేపట్టాలని రహదారులు, భవనాల శాఖ మంత్రిని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ సీతంపేట మండలంలోని రహదారుల మెరుగుకు నిధులు కేటాయించాలని కోరారు. సీతంపేట, మల్లి తదితర ప్రాంతాల్లో వారపు సంతలు జరుగుతాయని, పండించిన, సేకరించిన పంటలను గిరిజనులు అక్కడ విక్రయిస్తారని తెలిపారు. అందుకు అనుగుణంగా రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రధానంగా పైనాపిల్, జీడిమామిడి, సీతాఫలం, చీపుర్లు, పసుపు తదితర పంటలను సంతలకు తరలిస్తుంటారని, రహదారులు అధ్వాన్నంగా ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ప్రధానంగా కోడిశ, కడగండి రహదారి అధ్వానంగా ఉందన్నారు. నిధులు కేటాయించి రహదారులు మెరుగుపర్చాలని ఆయన కోరారు. కోడిశ, వజ్జాయిగూడ రహదారులను నిర్మించాలని మంత్రిని కోరారు.


కేపి ఈతమానుగూడ సమీపంలో ఉన్న జలపాతం అందాలు

ఆకట్టుకుంటున్న జలపాతాలు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఏజెన్సీలో ఉన్న జలపాతాలకు కొత్తకళ వచ్చింది. కుడ్డపల్లి పంచాయతీ కేపీ ఈతమానుగూడ గ్రామ సమీపంలో ఉన్న జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. నీరు కొండ పైనుంచి కిందకు జాలువారుతుండడంతో ఈ సుందర దృశ్యాన్ని చూసేందుకు ప్రజలు పోటెత్తుతున్నారు. కొందరు స్నానాలు ఆచరించి ఉల్లాసంగా గడుపుతున్నారు. సీతంపేటకు కూత వేటు దూరంలో ఉన్న ఈ జలపాతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దితే బాగుంటుందని ఆ ప్రాంత గిరిజనులకు కోరుతున్నారు.

వంతెన లేక.. అవస్థలు తప్పక

● వరద ఉధృతికి నిలిచిపోతున్న రాకపోకలు ● ఇదీ వర్షాకాలంలో ఆ ఐదు పంచాయతీల ప్రజల పరిస్థితి



ఎరుకొండ రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

పూసపాటిరేగ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకొండతోపాటు పసుపాం, మర్రిపేట, కొల్లాయివలస, పతివాడ, బర్రిపేట పంచాయతీల ప్రజలకు ఏటా వర్షాకాలంలో అవస్థలు తప్పడంలేదు. చిన్నపాటి వర్షం కురిసినా ఆయా పంచాయతీల పరిధిలోని గ్రామాలకు చేరుకోవడానికి అగచాట్లు పడుతున్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారుతున్నా తమ కష్టాలు గట్టెక్కడంలేదని వాపోతున్నారు. ఎరుకొండ వద్ద రోడ్డుపై వంతెన లేకపోవడంతో ఈ మార్గంలో వెళ్లే ఐదు పంచాయతీల ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందిపడుతున్నారు. ఎరుకొండకు ఎగువ ప్రాంతంలో ఉన్న చెరువు నీటితోపాటు వర్షం నీరు ఇక్కడ రోడ్డుపైనుంచి ప్రవహిస్తోంది. ఏపాటి ఉధృతి పెరిగిన ఈ ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ రహదారిపై నుంచి పొలాల గుండా చెరువుల్లోకి నీరుచేరుతోంది. సుమారు ఏడు కిలోమీటర్ల బీటీ రోడ్డులో ఎరుకొండ వద్ద వంతెన నిర్మిస్తే తమ కష్టాలు గట్టెక్కుతాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ ఐదు పంచాయతీ పరిధిలో సుమారు పది వేల మంది నివసిస్తున్నారు. వీరంతా ప్రతి పనికి పూసపాటిరేగ, భోగాపురం ఈ మార్గంలోనే రావాల్సివస్తోంది. వర్షాకాలంలో ఆగస్టు నుంచి నవంబరు వరకూ ఇక్కడ రోడ్డుపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని పలువురు చెబుతున్నారు. గతంలో ఎరుకొండ వద్ద వరద ఉధృతికి పలువురు వాహనాలతోపాటు ప్రజలు కొట్టుకుపోయారని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి వైసీపీ హయాంలో ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని ఎరుకొండ వద్ద వంతెన నిర్మించి, తమకు వర్షాకాలంలో పడుతున్న ఇబ్బందులకు చెక్‌పెట్టాలని ఎరుకొండ, పసుపాం, మర్రిపేట, కొల్లాయివలస, పతివాడ, బర్రిపేట పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

రేపు హుండీ లెక్కింపు

రాజాం/రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో గల పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో బీవీ మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు హాజరుకావాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని పూల్‌బాగ్ సెక్షన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం చెట్టు కొమ్మలు తొలగించే క్రమంలో గురువారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ త్రినాధరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు పూల్‌బాగ్ కాలనీ, మంగళవీధి, ప్రేమ సమాజం, విజయలక్ష్మీనగర్, కొత్తపేట, గొల్లవీధి, కుమ్మర వీధి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

28న సరస్ బజారు ఏర్పాటు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పైడితల్లి అమ్మవారు పండగ, విజయనగరం ఉత్సవాలు పురస్కరించుకుని సెర్ప్ ఆధ్వర్యంలో ఈనెల 28న సరస్ బజారు ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి తెలిపారు. మంగళవారం విజయనగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద స్టాల్స్ ఏర్పాటుకు భూమి పూజచేశారు. ఈ మేరకు ఏపీ నుంచి 90 స్టాల్స్, మెప్మా నుంచి 26 స్టాల్స్‌నాబార్డు నుంచి 50, ఇతర రాష్ట్రాల నుంచి 60 మొత్తం 220 స్టాళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు పీడీ తెలిపారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తు స్వీకరణకు గడువు పెంపు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్‌లో చేరడానికి దరఖాస్తు స్వీకరణకు గడువుపెంచినట్లు డీఈవో మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు అభ్యర్థులు రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వెల్‌నెస్ కేంద్రం తనిఖీ

లక్కవరపుకోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లి వెల్‌నెస్ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య మిషన్ అధికారులు వర్చువల్ విధానంలో తనిఖీ చేపట్టారు.ఇక్కడనాణ్యత ప్రమాణాలు పరిశీలించి రేటింగ్ ఇస్తారని ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యుడు అనిల్‌కుమార్ తెలిపారు. ఏడాదిగా నిర్వహించిన పరీక్షలు, రోగులకు ఇచ్చిన మందులు, సౌకర్యాలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు.

సుస్థిరాభివృద్ధి సాధనే పీ-4 లక్ష్యం

విజయనగరం రింగురోడ్డు సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి సాధనే పీ-4 లక్ష్యం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. మంగళవారం విజయనగరంలోని తన కార్యాలయంలోని కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సాధికారితకోసం ప్రభుత్వం పి-4 విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటి వరకూ జరిగిన సర్వేలో నగర పాలక పరిధిలో 3,760 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. వివిధ రూపాల్లో సహాయాన్ని అందించడానికి 299 మంది ముందుకువచ్చారని చెప్పారు.

భాషోపాధ్యాయుల తొలగింపు అన్యాయం

రాజాం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు భాషోపాధ్యాయ పోస్టుల తొలగింపు అన్యాయమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ సీనియర్ నాయకుడు వాండ్రంకి గౌరీకుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ యూపీ స్కూళ్లలో తెలుగు భాషోపాధ్యాయులను నియమించాలని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు శ్రీనివాసరావు,శంకరరావు, త్రిమూర్తి నాయుడు, గణపతిరావు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన పోలీసులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రణస్థలం రోడ్డులో గొర్లిపేట సమీపంలో రోడ్డుపై పడిన గుంతలనుపోలీసులు పూడ్చారు. ఇక్కడ ఏర్పడిన గుంతల వల్ల నెల్లిమర్ల-రణస్థలంరోడ్డులో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ స్థానిక యువకులకు అవగాహన కల్పించి యంత్రాలతో ఆ గుంతలను పూడ్చారు.

రబీకి ప్రణాళికలు సిద్ధంచేయండి: కలెక్టర్



మాట్లాడుతున్న రాంసుందర్ రెడ్డి

విజయనగరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాబోయే రబీ సీజన్‌లో సాగు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎన్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధి రేటు సాధించే విధంగా కృషిచేయాలని సూచించారు. మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల పనితీరుపై కలెక్టర్ ఆడిటోరియంలో సమీక్షించారు. వరిసాగులో గతఏడాది 95 శాతం లక్ష్యంసాధించగా ఈ ఏడాది 97శాతం చేరుకుందని తెలిపారు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమయానికి అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు ఈ-పంట బుకింగ్, వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ల వినియోగం వంటి సదుపాయాలను విస్తరించాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ రంగంలో పాలు, మాంసం, గుడ్లు 8.4 శాతం పెరుగుదల వల్ల ఉత్పత్తిలో 15 శాతం వృద్ధి సాధించవచ్చన్నారు. రైతు బజార్లు, శుభ్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రైతు బజార్లను సందర్శిస్తామని కలెక్టర్ తెలిపారు.సమావేశంలో జిల్లా వ్యవసాయఅధికారి భారతి, జిల్లా ఉద్యాన అధికారి చిట్టిబాబు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి దామోదరరావు, ఏపీఎంఐసీ పీడీ పీఎస్‌వీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

విజయనగరం ఉత్సవాల నిర్వహణ కోసం పలు కమిటీల్లో నియమించిన అధికారులు వ్యక్తిగతంగా, మనసు పెట్టి చిత్త శుద్ధితో పనిచేయాలని కలెక్టర్ రాంసుందర్ రెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్షించారు. వేదిక, కార్యక్రమం వారీగా ప్రణాళికాబద్ధంగా యాక్షన్ ప్లాన్ తయారుచేసుకొని ఉత్సవాలను ఎటువంటి లోటు లేకుండా నిర్వహించాలని తెలిపారు. గత ఏడాది నిర్వహించిన అన్ని రకాల కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో జేసీ సేతుమాధవన్ పాల్గొన్నారు.

పరిశ్రమల దరఖాస్తులకు అనుమతులివ్వాలి

గడువులోగా పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన దరఖాస్తులకు అనుమతులివ్వాలని కలెక్టర్ ఎన్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి పరిశ్రమల ప్రోత్సాహక కమిటీసమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అందిన 893 దరఖాస్తులకు 67 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వీటిని గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. పీఎం ఈజీపీ కింద 151 దరఖాస్తులు గ్రౌండ్‌అయ్యాయని, వాటి జాబితాను అందజేయాలని జిల్లా మేనేజర్‌కు సూచించారు.సమావేశంలో పరిశ్రమల జిల్లా మేనేజర్ కరుణాకర్, ఎల్‌డీఎమ్ మూర్తి, నాబార్డ్ డీడీఎం నాగార్జున, పీసీబీ ఈఈ సరిత పాల్గొన్నారు.

పోలీసుల పని తీరు మార్చుకోవాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):పోలీసు అధికారులు, సిబ్బంది మారుతున్న నేరాలకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షలో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎంజీపీఎస్, పోక్సో, అట్రాసిటీ, మిస్సింగ్, రోడ్డు ప్రమాద కేసులను పెండింగ్ కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, స్టేషన్‌కు వచ్చిన కారణాలు తెలుసుకొని వారికి సహాయపడాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, డీఎస్పీలు ఆర్ గోవిందరావు, రాఘవులు, వీరకుమార్ పాల్గొన్నారు. కాగా విజయనగరంలో వచ్చే నెల ఆరు, ఏడు తేదీల్లో జరగబోయే పైడితల్లి అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవం భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ రాంసుందర్ రెడ్డితో ఎస్పీ ఏఆర్ దామోదర్ మంగళవారం పరిశీలించారు. సిరిమాను తిరిగేమార్గం, ఆలయ పరిసరాలు, సిరిమాను తయారయ్యే హుకుంపేట ప్రాంతాలను పరిశీలించారు. పార్కింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఆర్డీవో కీర్తి, డీఎస్పీ ఆర్ గోవిందరావు, దేవదాయ శాఖ ఏసి శిరీష, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య పాల్గొన్నారు.

ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కుట్ర

● బొడ్డవరలో జిందాల్ నిర్వాసితుల నిరసన



నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మోసపోయిన రైతులను ఆదుకోవాల్సిన అధికారులు,ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోగా ఉద్యమాన్ని నీరుగార్చేకుట్ర చేస్తున్నారని జిందాల్ నిర్వాసితులు ఆరోపించారు. మండలంలోని బొడ్డవరలో నిర్వాసితులు చేపట్టిన నిరసనలు మంగళవారం 95 రోజుకుచేరాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమను జిందాల్ మోసం చేసిందని, శాంతియుతంగా నిరసన చేస్తుంటే అండగా నిలవాల్సిన అధికారులు తమ గొంతు నొక్కే యత్నం చేస్తున్నారని ఆరోపించారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ తెలిపారు మంగళవారం విజయనగరంలో జీఎస్టీ తగ్గింపు, స్లాబుల కుదింపు నేపథ్యంలో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు రెడ్డి పావనీ, పతివాడ రాజేష్, నీలాపు దేవి, అప్పారావు, రామారావు పాల్గొన్నారు.

పరిశ్రమలను నెలకొల్పి వలసలను అరికట్టాలి

విజయనగరం దాసన్నపేట,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పి వలసలను అరికట్టాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కులాల ఐక్యవేదిక జిల్లా ప్రతినిదులు చోడి ఆదినారాయణ, పాండ్రంకి వెంకట రమణ కోరారు. మంగళవారం విజయనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

శ్మశానవాటిక ఏర్పాటుకు స్థల పరిశీలన

లక్కవరపుకోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కల్లేపల్లిలో దళితులకు శ్మశానవాటిక ఏర్పాటుకోసం తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ కోటి, ఆర్ఐ సన్యాసిరావు, వీఆర్వోలు భాస్కరరావు, మోహన్, సర్వేయర్, జె.కన్నబాబు పాల్గొన్నారు.

పనిగంటల పెంపును ఉపసంహరించుకోవాలి

నెల్లిమర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పనిగంటలు పెంచుతూ ప్రభుత్వం చేసుకోవచ్చిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ముయ్యాద పాపారావు డిమాండ్ చేశారు. మంగళవారం కొండగుంపములో విలేకరులతో మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానాన్ని పది గంటలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని, మహిళలు నైట్‌డ్యూటీ చేస్తూ అవకాశం కల్పించిన బిల్లును వ్యతిరేకించాలని కోరారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాల నేపథ్యంలో కార్మిక హక్కులపై దాడి తీవ్రత పెరిగిందని తెలిపారు.

కనీస పెన్షన్ తొమ్మిది వేలు ఇవ్వాలి

రాజాం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఏతో కలిపి ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలుఇవ్వాలని పెన్షనరసంఘం గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్‌చేశారు.మంగళవారం మండలంలోని రాజయ్యపేటలో పెన్షనర మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓపీఎస్ రద్దుచేసి సీపీఎస్ పేరుతో పెన్షన్ స్కీములు తీసుకువస్తున్నాయని ఆరోపించారు.

ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా శ్రీనివాసరావు

రాజాం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):ఏపీటీఎఫ్ రాజాం మండలాధ్యక్షుడిగా బెవర శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. మంగళవారం రాజాంలో జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా డోల వాసుదేవరావు, గౌరవాధ్యక్షురాలిగా బి.రాజేశ్వరి, ఉపాధ్యక్షులుగా కుమరాపు చంద్రినాయుడు, ఎ.సన్యాసినాయుడు, ఎస్.మధు, డి.శ్రీనివాసరావు, గేదెల గీత, కార్యదర్శులుగా ఎస్.ఉమామహేశ్వరరావు, ఆర్.మురళి, వీఎస్ఎస్ కాశీనాథ్, ఎం.సత్యనారాయణ, జి.ధనలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా వై.సీతంనాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎంవీరమణ, ఎల్.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎన్.రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.సత్యంనాయుడు పాల్గొన్నారు.

అధికారుల సమక్షంలో యూరియా పంపిణీ

జిల్లాలో యూరియా విషయంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎటువంటి గొడవలు చోటుచేసుకుండా ఉండేందుకు అధికారుల సమక్షంలో పంపిణీకేపట్టారు.

● దత్తిరాజేరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా యూరియా పంపిణీ చేయాలని తహసీల్దార్ పి.విజయభాస్కర్ కోరారు. మంగళవారం వంగర, గొభ్యాం, షికారుగంజి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణమూర్తినాయుడు, మాజీ సర్పంచ్‌లు సత్యారావు, దేవుడు, వ్యవసాయ సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

●భోగాపురం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):భోగాపురంలో మాతావెంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని తహసీల్దార్ ఎం.రమణమ్మ మంగళవారం తనిఖీ చేశారు. యూరియా నిల్వల రికార్డులను పరిశీలించారు. వీఆర్వో వీవీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

●జామి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అందరికి యూరియా అందిస్తున్నామని, ఎటువంటి కొరత లేదని ఏవో పూర్ణిమ తెలిపారు. మంగళవారం అగ్రహారం రైతులకు యూరియా పంపిణీచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

● రేగిడి, సెప్టెంబరు 23,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిశ, కొమిర, చిన్నశిర్లాం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఎరువుల పంపిణీని తహసీల్దార్ కృష్ణలత పరిశీలించారు. కోడిశలో పోలీస్‌ల పర్యవేక్షణలో పంపిణీ చేశారు.

● సంతకవిటి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):మండలంలోని సిరిపురంలో యూరియా పంపిణీ నిలిపివేశారు. ఇక్కడ సచివాలయానికి పది మెట్రిక్ టన్నులు (224 బస్తాలు) యూరియావచ్చింది. గ్రామంలో 500 మందికి పైగా రైతులు సచివాలయానికి రావడంతో పంపిణీచేయడానికి అధికారులు ఇబ్బందులుపడ్డారు.ఇంకో లోడ్ యూరియా వచ్చిన తరువాత అందరికీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్థులు కోరడంతో పంపిణీని నిలిపివేశారు.

●డెంకాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): డెంకాడ రైతు భరోసా కేంద్రం, సాయికృష్ణ రైతు మిత్ర గ్రూపు ఎరువుల షాపు వద్ద ఏవో సంగీత, తహసీల్దార్ రాజారావు, ఎస్ఐ సన్యాసినాయుడుల ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.సోమవారం మండలానికి 48 మెట్రిక్ టన్నుల యూరియావచ్చిందని, మంగళవారం పెదతాడివాడ, పినతాడివాడ, సింగవరం, నాతవలస, నగరంపేట, మహంతిపేట, గుండాలపేట, రఘుమండ రైతులకు పంపిణీ చేసినట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రామకోటి, వీఏఏలు లెనిన్, రాంబాబు, అపర్ణ పాల్గొన్నారు.



సంతకవిటి: సిరిపురంలో యూరియా కోసం ఎగబడిన రైతులు

యూరియా కోసం బైఠాయించిన రైతులు

గుర్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గుర్లలో మంగళవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. యూరియా కోసం వివిధ ప్రాంతాల నుంచి రైతులు తరలివచ్చారు. దీంతో ఎరువుల దుకాణదారులు మూసేయడంతో రైతులు రోడ్డుపై బైఠాయించారు. ఎస్ఐ నారాయణరావు వ్యవసాయాధికారులతో మాట్లాడి బుధవారం ఎరువులు అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు.

రాజాంలో కుండపోత వర్షం

● జలమయమైన రోడ్లు ● ఇళ్లల్లోకి మురుగు నీరు

రాజాం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):రాజాంలో మంగళవారం కుండపోత వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మధ్యాహ్నం మూడుగంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ వర్షం కురవడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. మెయిన్‌రోడ్ మీదుగా మురుగునీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. శ్రీకాకుళం రోడ్‌లో ద్విచక్రవాహనచోదకులు అవస్థలకు గురయ్యారు. ఇదే రోడ్‌లోని సప్తగిరికాలనీతోపాటు మల్లిఖార్జునకాలనీలో ఇళ్లల్లోకి మురుగునీరంతా చేరడంతో ఇళ్లలో ఉంటున్నవారు ఇబ్బందులకు గురయ్యారు. ఇళ్లల్లోకి చేరిన నీటిని తొలగించేందుకు శ్రమించాల్సివచ్చింది.ఈశ్వరనారాయణ కాలనీలోని ఐదులైన్లు, బాబానగర్, నరసింహనాయుడుకాలనీ తదితర కాలనీల్లోకి వెళ్లేందుకు పలువురు ఇబ్బందులు పడ్డారు. బొబ్బిలిరోడ్‌లో పలువీధుల్లోని మురుగునీరంతా మెయిన్‌రోడ్ మీదుగా రెండు అడుగుల మేర ప్రవహిస్తూ శ్రీకాకుళంరోడ్‌లో కిలోమీటరు మేర నిలిచిపోయింది. గొల్లవీధి, చాకలివీధి, రెల్లివీధి, మెంటిపేట ఎస్సీ కాలనీల్లో మురుగునీటి నిల్వలు పేరుకుపోయాయి.



రాజాం రూరల్: మెయిన్‌రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న మురుగునీరు

వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలి

రేగిడి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాగావళి నదీతీరంలోగల తొమ్మిది లోతట్టు గ్రామాలకు తుఫాన్ దృష్ట్యా జిల్లా వరద హెచ్చరికలు జారీచేశారు. ఈ మేరకు మంగళవారం బొడ్డవలస, ఖండ్యాం, వెంకటాపురం, గదబపేట, పుర్లి, రేగిడి, కందిశ, పాతచెలిగానవలస, తునివాడ తదితర లోతట్టు గ్రామాల్లో వీఆర్వోలు దండోర వేసి అప్రమత్తంచేశారు. భారీ వర్షాల వల్ల నదిపొంగే ప్రమాదముందని, ఎవరూ నది వద్దకు వెళ్లొద్దని అప్రమత్తంచేసినట్లు తహసీల్దార్ కృష్ణలత తెలిపారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వీఆర్వోలకు వరద హెచ్చరికలు జారీఅయ్యాయి.

విధి నిర్వహణలో విగతజీవిగా మారి..

● గుండెపోటుతో ఎస్.కోట ఆర్టీసీ డిపో కండక్టర్ మృతి



సీటులోనే మృతిచెందిన కండక్టర్ ఈశ్వరరావు

శృంగవరపుకోట/పెందుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ కె.ఈశ్వరరావు విధి నిర్వహణలో విగతజీవిగా మారాడు.బస్సులో ఉన్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. శృంగవరపుకోట డిపోలో పనిచేస్తున్న కండక్టర్ పి.ఈశ్వరరావు (51) మంగళవారం ఉదయం కొట్టాం- విశాఖ-కించుమండ సర్వీసులో విధులకు హాజరయ్యారు. బస్సు మధ్యాహ్నం విశాఖ నుంచి తిరిగి వస్తుండగా పెందుర్తి మండలం సరిపల్లికి చేరుకునేసరికి గుండెలో నొప్పిగా ఉందని డ్రైవర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన డ్రైవర్ బస్సును వెనక్కితిప్పి పెందుర్తి సీహెచ్‌సీకి తరలించారు. ఈశ్వరరావును పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పెందుర్తి పోలీసులు తెలిపారు. గంట్యాడ మండలంలోని వసంత గ్రామానికి చెందిన ఈశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తులు ఉన్నారు. ఈశ్వరరావు మృతిపైడిపో ఎంప్లాయిస్ యూనియన్‌తోపాటు సహచర ఉద్యోగులు సంతాపం తెలిపారు.

12 మందిపై బైండోవర్

రాజాంరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి):రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ గతంలో పట్టుబడిన 12 మంది పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీం తెలిపారు. బీఎన్ఎస్ఎస్ చట్టం- 2023 సెక్షన్ 129 కింద రాజాం తహసీల్దార్ రాజశేఖర్ ఎదుట మంగళవారం హాజరుపరిచినట్లు చెప్పారు. ఒక్కో నిందితునికి రూ.లక్ష అపరాదరుసుము పూచీకత్తుపై ఏడాదికి బైండోవర్ చేసినట్లు చెప్పారు.

చెట్టుపై పిడుగు

కొత్తవలస, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగపురంలో ప్రాథమికోన్నత పాఠశాలలో పెనుప్రమాదం తప్పింది. మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసిన సమయంలో స్కూల్ ఆవరణలోగల టేకు చెట్టుపై పిడుగుపడింది. ప్రస్తుతం పాఠశాలకు దసరా సెలవులు కావడంతో విద్యార్థులు ఎవరూ పాఠశాల లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పాఠశాల ఉన్న సమయంలో పిడుగు పడితే పెను ప్రమాదం జరిగి ఉండేదని గ్రామస్థులు తెలిపారు. వర్షంతోపాటు ఈదురుగాలులకు భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

మైనింగ్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న మైనింగ్ కార్మికులు

గరివిడి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాడ, గుర్ల మండలంలోని సదానందపురంలో ఆర్‌బీఎస్ఎస్ఎఫ్ఎన్ అండ్ దాస్ కంపెనీలో 35 ఏళ్లుగా పనిచేస్తున్న మైనింగ్ కార్మికులు గరివిడి డీఎఫ్ఎన్ ప్రాంతం వద్ద మంగళవారం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరవధిక నిరసన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ మాట్లాడుతూ 35 ఏళ్లుగా పనిచేస్తున్న 503 మంది కార్మికులను విధుల నుంచి తొలగించి సర్వీస్ సెటిల్‌మెంట్ చేస్తామని యాజమాన్యం పేర్కొనడం తగదన్నారు. లీజులను తిరిగి ప్రభుత్వం పునరుద్ధరించి కార్మికులకు పనులు కల్పించే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ.గౌరినాయుడు, కె.విశ్వనాథరాజు, అప్పలనాయుడు, సన్యాసినాయుడు, పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

దత్తిరాజేరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని షికారుగంజిలో మోడల్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వృత్తివిద్య అధ్యాపకుడు బి.కిరణ్‌కుమార్ ఆటోమోటివ్ రంగంపై అవగాహన కల్పించారు.వృత్తివిద్యలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్ఎం ఈశ్వరరావు తెలిపారు.

బాధితులకు పరిహారం అందజేయండి

బొండపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవుపల్లి రెవెన్యూ పరిధిలోని 322-6 సర్వేనెంబరులోగల మామిడితోటను ప్రభుత్వం అండతో గ్రామానికి చెందిన కొందరు నాశనం చేశారని ఎంపీపీ చల్లా చలంనాయుడు ఒక ప్రకటనలో ఆరోపించారు. తక్షణమే అధికారులు, పాలకులు బాధితులకు న్యాయం చేసి పరిహారం అందజేయాలని డిమాండ్‌చేశారు. 20 ఏళ్లుగా చేకూరి సూర్యకుమారి,ముదునూరు సన్యాసిరాజు హక్కు,అనుభవం,సాగులో ఉన్న భూమిలో ఉన్న సుమారు 11 ఎకరాల మామిడితోటను ఇటీవల రెవెన్యూ సిబ్బంది వన్‌బీ మంజూరుచేశారని తెలిపారు. దీంతో వీరు అధికారులు, స్థానికుల అండతో అనుమతి లేకుండా యంత్రాలతో తోటను తొలగించారని ఆరోపించారు.దీంతో 30 ఏళ్లుగా తోటను పెంచి సంరక్షించిన బాధితులు అన్యాయానికి గురయ్యారని తెలిపారు.

ఎరువుల దుకాణంపై 6ఏ కేసు

విజయనగరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంతకవిటిలోని ఓం శ్రీవినాయక ఎరువుల దుకాణంపై 6ఏ కేసు నమోదుచేసి, రూ.13.62 లక్షల విలువైన సరుకును సీజ్‌చేసినట్లు జేసి సేతు మాధవన్ తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు దుకాణాన్ని తనిఖీచేసినట్లు పేర్కొన్నారు. డీఏపీ, 16.16.16 ఎంవోసీ ఎరువుల బిల్లులు చెల్లించకుండా అమ్మకాలు చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఈ-పాస్ యంత్రంలో ఉన్న నిల్వలకు దుకాణంలో ఉన్న సరుకుకు వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. రూ 39,650 విలువ చేసిన 23 బస్తాలు తేడాఉండడంతో మిగతా ఎరువులు సీజ్‌చేసినట్లు తెలిపారు. వీటిని పక్కనఉన్న మరో దుకాణానికి అప్పగించామని, పూర్తిస్థాయి నివేదికను జేసీ విచారణ జరిపి రూ. 15,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

EDUCATION
Open 10th/Inter/Degree మరియు Govt University లో ODL Degree మరియు PG Admissions జరుగుచున్నవి. Degree ఫెయిల్ అయిన స్టూడెంట్స్ Degree పూర్తి చేయు అవకాశం కలదు. Pass గ్యారెంటీ. సంప్ర :7997296796.
AJV_241548

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు: ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

పుర పాలన.. గాడిన పడేనా?

(5వ పేజీ తరువాయి)

రోజుల కిందట సెలవు పెట్టి వెళ్లినట్లు సమాచారం. రెవెన్యూ విభాగంలో ఆర్‌వో, ఇద్దరు ఆర్‌ఐల మధ్య సరైన అవగాహన లేక పన్నుల వసూళ్లను పెంచలేకపోతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగంలో టౌన్ ప్లానింగ్ అధికారి ఒక్కరే ఉండడంతో పని ఒత్తిడి పెరుగుతుందనేది వాస్తవం. పట్టణంలోని ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండా భవనాల నిర్మాణం జరుగుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు.

వార్డుల్లో సమస్యలు

ఓన్‌పే, ఎఫ్‌ఏసీ కమిషనర్ల వల్ల వార్డుల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ మెరుగుపడడం లేదు. ప్రస్తుతం కుళాయిల ద్వారా రంగు మారిన నీరు సరఫరా అవుతున్నా స్పందించేవారే కరువయ్యారు. పట్టణంలో 80 వేలకు పైబడి జనాభా ఉన్నా.. ఆ స్థాయిలో పారిశుధ్య కార్మికులను నియమించడం లేదు. పక్కనే ఉన్న బొబ్బిలి, సాలూరు మున్సిపాల్టీల్లో పారిశుధ్య కార్మికుల సంఖ్య ఎక్కువగానే ఉన్నా.. పార్వతీపురంలో మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. మరోవైపు పట్టణంలో వీధి దీపాల నిర్వహణను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గత మూడు నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలో ఎప్పటి కప్పుడు సెంటర్ లైటింగ్ మరమ్మతులకు గురవడంతో పాదచారులు బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీనికి తోడు ఏ మాత్రం వర్షం పడినా.. ప్రధాన రహదారిలో మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచిపోవడంతో నివాసితులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. వాహనదారులు కూడా ప్రయాణించలేక పోతున్నారు. మొత్తంగా అటు అధికారులు, ఉద్యోగులు, ఇటు పాలకవర్గ సభ్యులు ఎవ రికి వారే అన్న చందంగా తయారయ్యారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపాల్టీలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తున్నాం. అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయం కుదిర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు అన్ని వేళల సేవలు అందించేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నాం.

- శ్రీనివాసరాజు, మున్సిపల్ కమిషనర్ ఎఫ్‌ఏసీ, పార్వతీపురం

మా పరిస్థితేంటి?

(5వ పేజీ తరువాయి)

ఎనిమిది మంది ఏఎన్ఎంలను అప్పట్లో నియమించారు. మొదటిలో రూ.18వేల జీతమని చెప్పారు. ఐఆర్‌పీడబ్ల్యూ స్వచ్ఛంద సేవా సంస్థలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా చూపుతూ.. నెలకు రూ.15వేలే చెల్లించేవారని వైటీసీ సిబ్బంది తెలిపారు. కాగా భద్రగిరి వసతి గృహంలో స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంలు, డ్రైవర్, సెక్యూరిటీ సిబ్బందితో కలిపి మొత్తంగా 11 మంది పనిచేస్తున్నారు. ఇక సీతంపేట ఇద్దరు స్టాఫ్ నర్సులు, అంబులెన్స్ డ్రైవర్, స్వీపర్ ఉన్నారు. వారంతా కొన్నాళ్లుగా గిరిజన గర్భిణులకు సేవలంది స్తున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా నిలుపుదల చేయడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతిని వివరణ కోరగా.. 'ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైటీసీ సిబ్బందిని తాత్కాలికంగా నిలుపుదల చేశాం. వారి స్థానంలో ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వారిని నియమిస్తాం.' అని తెలిపారు.

తొలగింపు ఆలోచన మానుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: 'గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో పనిచేస్తున్న వైద్యసిబ్బందిని తొలగించాలనే ఆలోచనను జిల్లా అధికారులు మానుకో వాలి. గత ఆరేళ్లుగా చాలీచాలని జీతంలో వారు పనిచేస్తూ.. వైద్య సేవలు అందిస్తున్నారు. సాలూరు, గుమ్మలక్ష్మీపురం వైటీసీల్లో నిర్వహిస్తున్న గిరిజన గర్భిణుల వసతిగృహాలను నీతిఆయోగ్ కూడా గుర్తించి ప్రశంసించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వైటీసీ సిబ్బందిని ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. గత ఏడు నెలలుగా వారికి బకాయిపడిన జీతాలు తక్షణమే చెల్లించాలి.' అని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కమిటీ అధ్యక్షుడు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు.

కొత్త గురువులకు పిలుపు

(5వ పేజీ తరువాయి)

జిల్లా నుంచి 17 బస్సులు ఈ నెల 24న మొదవలస నుంచే బయలు దేరుతాయన్నారు. మరో రెండు బస్సులు స్పేర్‌గా ఉంచుతామని వెల్లడించారు.

578 టీచర్ పోస్టులు భర్తీ

ఉమ్మడి జిల్లాలో 578 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వాటిలో 266 ఎస్జీటీలు, పాఠశాల సహాయకుల విభాగంలో సోషల్ స్టడీస్ 67, ఫిజిక్స్ 56, బయాలజీ 36, గణితం 33, తెలుగు 14, హిందీ 14, ఆంగ్లం 30, ఫిజికల్ డైరెక్టర్ 62 పోస్టులు ఉన్నాయి. ఎంపికైన వారిలో 257 మంది మహిళలు టీచర్ పోస్టులు సాధించారు. పాఠశాల సహాయకుల హిందీ విభాగంలో 14 పోస్టులకు గాను 12 పోస్టులను మహిళలే దక్కించుకున్నారు. మేనేజ్‌మెంట్ వారీగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో 14, సాలూరు, పార్వతీపురం, బొబ్బిలి మున్సిపాలిటీల్లో 55, జడ్పీ, ఎంపీపీ స్థానిక సంస్థల్లో 372, గిరిజన సంక్షేమశాఖలో 137 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీలో ఎంపికైన వారితో భర్తీ చేయనున్నారు. కొత్త గురువులు విజయవాడలో పోస్టింగ్ ఆర్డర్ స్వీకరణ అనంతరం శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ జరిపి పాఠశాలలు కేటాయించ నున్నారు.

పర్యాటక అభివృద్ధికి చర్యలు

(5వ పేజీ తరువాయి)

సంబంధిత అధికారులను ఆదేశించారు. వాటి నిర్మాణానికి కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. దీని కోసం స్థానిక యువతకు రుణాలు మంజూరు చేసి, పర్యాటకుల కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని సూచించారు. గిరిశిఖర గ్రామాలపై దృష్టి సారించి, డోలీ మోతలు లేకుండా చూడాలని వెల్లడించారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్‌లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కగా అమలు చేయాలని తెలిపారు. గిరిజన యువతకు స్కిల్ ట్రైనింగ్‌లు, ఇవ్వాలని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని, సూచించారు. మలేరియా, డెంగ్యూ క్షయ వంటి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీవో చిన్నబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం, భామినిలో భారీ వర్షం

వీరఘట్టం/ భామిని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంతో పాటు పరిసర గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ కాయగా మధ్యాహ్నం వర్షం కురిసింది. అలాగే భామినిలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రైతులు, ప్రజలకు ఊరటనిచ్చింది. అధికంగా వర్షాలు కురిస్తే పత్తి, మొక్కజొన్నకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు చేపట్టండి

● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పాలకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని మన్యం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగర పంచా యతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విభాగాల వారీగా ప్రగతి పై ఆరా తీశారు. కార్యాలయ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి వాటిని సక్రమంగా భద్రపర్చాలని సూచించారు. నగర పంచాయతీ పరిధిలో ఉన్న పార్కులపై ఆరా తీశారు. పార్కులో మొక్కలు ఏ మేరకు వేశారు అని కమిషనర్ రత్నంరాజును అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. మరోసారి నగర పంచాయతీకి వచ్చేనాటికి రికా ర్డులు చిందరవందరగా ఉన్నా, పనితీరు బాగోలేకపోయినా చర్యలు తప్పవని హె చ్చరించారు. అనంతరం నగర పంచాయతీ సిబ్బందితో సమీక్షించారు. ఆయనతో పాటు సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్, తహశీల్దార్ రాధాకృష్ణ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

అమ్మవారిపై భక్తితో..



ఎరుపు రంగు దుస్తుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, శాసన మండలిలో కూటమి మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒకే రంగు దుస్తులు ధరించారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా రోజుకో రంగు దుస్తుల్లో అసెంబ్లీకి రావాలని మహిళా సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం అమ్మవారు గాయత్రీ దేవి అలంకారం సందర్భంగా ఎరుపు రంగు దుస్తులతో సభకు వ చ్చారు. మన సంస్కృతీ, సంప్రదాయాల కోసం మంచి సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఒకేలా దుస్తులు ధరిస్తున్నట్టు హోం మం త్రి అనిత తెలిపారు. ఇందులో విజయ నగరం ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఉన్నారు.

గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు, అవసరాలను అధికారుల ముందు ఉంచేందుకు గ్రామసభ ప్రధాన వేదిక అని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మన్యం జిల్లా కన్వీనర్ పాలక సుధీర్, కో-కన్వీనర్ కద్రక వైకుంఠరావు అన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలన్నారు. మంగళవారం స్థానిక తహ సీల్దార్ శేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరులో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామసభలను పక్కాగా నిర్వహించే ఏర్పాటు చేయాలన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలని జిల్లా ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు సూచించారు. మంగళవారం పెదబొండపల్లి పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన ఆయన అక్కడ అందజేస్తున్న వైద్య పరీక్షలు పరిశీలించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు జి.ధరణి, పి.ఎల్.గోపాలకృష్ణ, వైద్య నిపుణులు డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ భరత్‌చంద్ర, డాక్టర్ రమ్య, ఆయుష్ వైద్యురాలు సుశీల, డెమో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగుతో ప్రయోజనాలు



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులతో సాగు వల్ల ప్రయోజనం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబంధకుడు ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు అన్నారు. మంగళవారం చింతలబెలగాంలో ఎం.సత్యంనాయుడు, పి.కృష్ణ, జె.శంకరరావు, ఎస్.కూర్మి నాయుడులకు చెందిన వరి క్షేత్రాల్లో డ్రోన్ ద్వారా జిల్లేడు ద్రావణం పిచికారీని ఆయన పర్యవేక్షించారు. జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేయాలంటే డ్రోన్ ద్వారా సులువు అవుతుందన్నారు. ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. కార్యక్ర మంలో ప్రకాశ్, హేమసుందర్, ఎన్ఎఫ్ఏ ఆర్.శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్ బి.శ్రీరామ్, బి.ధనుంజయ, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

సమాచారమివ్వలేదని అడ్డుకున్నాం: సీఐ

సాలూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి సమాచారం లేకుండా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఇంటిని శనివారం ముట్టడించిన గిరిజన నిరుద్యోగులను అడ్డుకున్నాం గానీ వారిని అరెస్టు చేయ లేదని పట్టణ సీఐ బి.అప్పలనాయుడు తెలిపారు. మంత్రి ఇంటికి వచ్చిన గిరి జన నిరుద్యోగులను అరెస్టు చేశారనే ప్రచారాన్ని ఆయన మంగళవారం ఖం డించారు. మంత్రి ఇంటి ముట్టడిపై పట్టణ, రూరల్ పోలీసుల నుంచి ముం దస్తుగా ఎలాంటి అనుమతి తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో ముట్టడి వచ్చిన వారిని నిబంధనలు ప్రకారం అడ్డుకున్నామని ఆయన స్పష్టం చేశారు.

బెల్టు దుకాణాలపై నిఘా

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణాల నిర్వహణపై ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శిరీష తెలిపారు. మంగళవారం పట్టణంలోని మద్యం దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బెల్టు దుకాణాల నిర్వహణకు అవకాశమివ్వరాదని హెచ్చరించారు. బెల్టు దుకాణాలకు మద్యం బాటిళ్లు సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు మద్యం నిల్వలపై సమా చారాన్ని అందించాలని ఆయా షాపుల యజమానులకు సూచించారు.

భక్తులకు అన్నదానం

పాలకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న కోటదుర్గమ్మ శరన్నవరాత్రుల్లో భాగంగా రెండోరోజు మంగళవారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, గౌరీపార్వతి దంపతులు, వారి కుమారుడు మణికంఠ భక్తులకు అన్నదానం చేశారు. ముందుగా అమ్మవారిని కుటుంబ సమేతంగా వి క్రాంత్ దర్శించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం పెట్టిన అనంతరం అన్నదానం చేశారు.

నానో యూరియా వాడండి

సాలూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నానో యూరియాను వాడితే మేలని మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. అన్నం రాజువలసలో మంగళవారం ఆమె పర్యటించారు. నానో యూరి యా, నానో డీఏపీ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

టీడీపీలో గురుగుబిల్లి ఎంపీపీ చేరిక

● ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు కూడా..



పార్టీలో చేరిన వారితో శ్రీనివాసరావు, జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో మంగళవారం గురుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావుతో పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో వారంతా టీడీపీలో చేరారు. వారందరికీ కండువాలను పల్లా శ్రీనివాసరావు, జగదీశ్వరి వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీలో కొత్తగా చేరిన వారు పార్టీలో ఉన్న నాయకులతో సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్, దత్తి లక్ష్మణరావు, మర్రాపు పురుషోత్తంనాయుడు, అక్కెన మధుసూదనరావు, అంబటి రాంబాబు, ముదిలి బాబు, విజయాంకుశం, కోట సుమన్, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో వైసీపీకి షాక్

●గరుగుబిల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఎంపీపీ ఉరిటి రామారావుతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు మంగళవారం వైసీపీని వీడి టీడీపీ లో చేరారు. మంగళగిరిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనువాసరావు, ప్ర భుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ తదితరుల సమక్షంలో వారు టీడీపీ కండువాలు వేసుకున్నారు. పార్టీలో చేరిన వారితో ఎంపీపీతో పాటు ఎంపీటీసీ సభ్యులు చింతల రూపవతి, గుంట్రెడ్డి అన్నపూర్ణమ్మ, యందవ సదానందనం... సర్పంచ్‌లు ఉరిటి నిర్మల, బొంతాడ మహేశ్వరరావు, బొత్స లక్ష్మి, జాగాన సరస్వతి, గొట్టాపు శ్రీవేణి, గులిపల్లి నారా యణమ్మ, బేత వెంకటనాయుడు... వైసీపీ నాయకులు గొట్టాపు తేజేశ్వరరావు, మూడడ్ల అప్పారావు, బోను చంద్రశేఖరరావు, చింతల మల్లినాయుడు, గుం ట్రెడ్డి శంకరరావు, నల్ల రవికుమార్, జాగాన మురళీమోహన్, మువ్వల సింహా చలం నాయుడు, పెదిరెడ్డి శ్రీనువాసునాయుడు, గుంట్రెడ్డి శంకరరావు, బోను సురేష్, బాణాల సురేష్, పప్పల సత్యనారాయణ, అల్లు అప్పలనాయుడు, అక్కేన రామకృష్ణ, దాసరి ఆదినారాయణ, గొట్ట గౌరునాయుడు, రాజాన వెంకటనాయుడు తదితరులున్నారు.

గాయత్రీదేవీ అవతారంలో దుర్గమ్మవారు



బెలగాం రైల్వే గేటు సమీపంలో నవదుర్గలు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని పలు అమ్మవార్ల ఆలయాలతో పాటు ఉత్సవ మండపాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి, దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు, హోమాలు నిర్వహించారు. బెలగాం రైల్వే గేటు సమీపంలో నవదుర్గాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు.



పంచముఖేశ్వర ఆలయంలో పార్వతి అవతారంలో అమ్మవారు

●సాలూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాలూరులో కామాక్షి, పంచముఖేశ్వర, వాసవి, శ్యామలాంబ, కోటదుర్గ, జీగిరాం దుర్గ, సంతోషిమాత, జ్ఞాన సరస్వతి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచముఖేశ్వర ఆలయంలో అమ్మవారికి సుబ్బ గురువు ఆధ్వర్యంలో రుత్వికుడు వినయశర్మ పూజలు నిర్వహించారు.

●భామిని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు పురస్కరించుకుని భామిని కీర్తిరాయిదొరలు మంగళవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూకాలమ్మ, గుండలమ్మ, పోతురాజు, కనకదుర్గమ్మ, నీలమ్మతల్లికి ముర్రాటలు సమర్పించారు. అమ్మవార్లకు మొక్కుబడులు చెల్లించుకున్నారు.

●వీరఘట్టం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళ వారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్య లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

●పాలకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోటదుర్గమ్మ అమ్మవారిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆల య ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ పూజలు నిర్వహించారు.

ఈ-క్రాప్ నమోదుకు ఎదురుచూపు

భామిని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ-క్రాప్ నమోదుకు భామిని రైతులు ఎదురుచూస్తున్నారు. సెప్టెంబరులోగా పంట నమోదు కాకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందని దిగులు చెందుతున్నారు. గతేడాది భామినిలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ పలువురు రైతులు పంట నమోదు చేయకపోవడంతో అ వస్థలు పడ్డారు. అయితే భామిని సచివాలయంలో వ్యవ సాయ సహాయకుడు లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ● ఈ విషయమై వ్యవసాయ అధికారి తిలక్ వద్ద ప్రస్తావించగా భామినిలో పంట నమోదు కాలేదన్నారు. రైతుల నుంచి దరఖాస్తులు సేకరిస్తున్నా మన్నారు. ఇప్పటికీ వడ్డంగి, నులకజోడు, పెద్దదిమిలి, బొడ్డగూడలో పంట నమోదు శతశాతం పూర్తయిందని తెలిపారు. మండలంలో 15 వేల ఎకరాలకు గాను 9 వేల ఎకరాల పంట నమోదు జరిగిందన్నారు. నలుగురు వీఏఏలకు ఏర్పాటు చేసి త్వరితగతన పంట నమోదు చేపడతామన్నారు.

దోమ తెరలు, టార్పాలిన్ల పంపిణీ

మక్కువ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయరామపురంలో గిరిజనులకు మంగళవారం దు స్తులు, టార్పాలిన్లు, దోమ తెరల పంపిణీ జరిగింది. రెడ్ క్రాస్ సొసైటీ, టాటా కంపెనీ, మహిళా వెల్ఫేర్ సంయుక్తంగా వాటిని అందజేశాయి. ఈ సందర్భంగా సాంఘిక వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. మానవ అక్రమ రవాణా నిర్మూలన, బాల్య వివాహాల నివారణ, మహిళలపై లైంగిక వేధింపులు, డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించడం, సీజనల్‌గా వ్యాధుల ను నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో టాటా కంపెనీ, రెడ్‌క్రాస్ సొసైటీ, మహిళా వెల్ఫేర్ ప్రతినిధులు చుక్క చినబాబు, ఎ.పద్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై గ్రామాల్లో అవగాహన

సీతంపేట రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు. వెలుగు, వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళ వారం తాడిపాయి, దోనుబాయి, కిల్లాడ, దారపాడు, గుమ్మడ గ్రామాల్లోని గిరిజనులకు వ్యాధులపై అవ గాహన కల్పించారు. గిరి బజారు వాహనంలోని డిజిటల్ స్క్రీన్ ద్వారా పలు అంశాలపై ప్రజలకు చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా మలేరి యా అధికారి పీవీ సత్యన్నారాయణ, దోనుబాయి పీ హెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్, ఏఎంవో శ్రీనివాస రావు, సబ్ యూనిట్ అధికారి మోహనరావు, ఎంటీఎస్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

సువర్ణముఖికి తగ్గని వరద ఉధృతి



సువర్ణముఖిలో వరదనీటి ప్రవాహం

మక్కువ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శంబర సమీపంలోని వెంగళరాయసాగర్ జలాశయంలోకి ఎగు వన కురుస్తున్న వర్షాల వల్ల వరదనీరు భారీగా చేరు తోంది. దీంతో సువర్ణముఖిలో వరద ప్రవాహం ఎక్కు వైంది. మరోవైపు నదీపరివాహక ప్రాంత పరిధిలోని పొలాలు ఉన్న రైతులు తమ పంటలను చూసుకోవ డానికి ఇబ్బంది పడుతున్నారు. నది దాటేందుకు అష్ట కష్టాలు ఎదుర్కొంటున్నారు.

కార్మికుల హక్కులు కాపాడాలి

బెలగాం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులు, భద్రత కాపాడే దిశగా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం బెలగాంలో ఆయన విలేకరులతో మాట్లా డారు. 8 గంటల పని పద్ధతిని కొనసాగించాలని డి మాండ్ చేశారు. అదనపు సమయం పని చేస్తే అదనంగా భత్యం చెల్లించాలనే నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న సంస్థ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ నాయకులు సింహాద్రి, దుర్గారావు పాల్గొన్నారు.



వట్టిగెడ్డ కుడి కాలువకు గండి

● వెనువెంటనే పూడ్చిన ప్రాజెక్టు కమిటీ



ఇసుక బస్తాలతో గండి పూడ్చివేత

జియ్యమ్మవలస, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):వట్టిగెడ్డ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువకు సోమవారం రాత్రి భారీ గండి పడింది. కుడి కాలువ పరిధిలో తాళ్లడుమ్మ సమీపంలో కాలువ రిటైనింగ్ వాల్ వరదకు కొట్టుకుపోవడంతో దిగువ ప్రాంతానికి వరద పోటు ఎక్కువయ్యింది. పంట పొలాలు నీట మునిగాయి. విషయం తెలుసుకున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎం.సత్యంనాయుడు, వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్ మంగళవారం ఉదయం గండిని పరిశీలించారు. వెంటనే ఇసుక బస్తాలతో గండిని పూడ్చించారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మూడు రోజులుగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో ఏజెన్సీ వైపు వర్షాలు ఎక్కువగా కురవడంతో ప్రాజెక్టులోకి భారీ వరద వచ్చి చేరుతుండటంతో గండి పడిందని ప్రాజెక్టు కమిటీ తెలిపింది. రైతులు అప్రమత్తంగా ఉండి ఎక్కడైనా ఇటువంటి పరిస్థితి ఉంటే తమకు గానీ, నీటి పారుదలశాఖ ఏఈకి గానీ సమాచారం అందజేయాలని కోరారు.

